RNI : APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ 08

హైదరాబాద్ | శనివారం | 26-09-2026 | సంపుటి : 14 | సంచిక : 356 | పేజీలు : 8 | వెల : 6/- | ఎడిటర్ : సందీప్ గౌడ్ వి

## కేరళ గడ్డపై సీఎం రేవంత్‌కు

# అరుదైన గౌరవం

**ఆర్యదాన్ అవార్డు అందజేత**

**నిలంబూర్‌లో 'ఆర్యదాన్ ముహమ్మద్-2026' పురస్కారం స్వీకరించిన సీఎం**

**కేరళకు చెందిన దిగ్గజ నేత పేరిట అవార్డు అందుకున్న తొలి కేరళేతర వ్యక్తిగా గుర్తింపు**

**రైతులు, వెనుకబడిన వర్గాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు**



కేరళ రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆర్యదాన్ ముహమ్మద్ పేరు మీద ఏర్పాటు చేసిన పురస్కారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వరించింది. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డును సీఎం స్వీకరించారు. కేరళకు వెలుపల నుంచి ఈ గౌరవాన్ని అందుకున్న తొలి వ్యక్తిగా రేవంత్‌రెడ్డి నిలిచారు. ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కే.సీ. వేణుగోపాల్ పాల్గొని స్మారకోపన్యాసం చేశారు. అవార్డు కింద రూ.లక్ష నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు.

హైదరాబాద్/నిలంబూర్, సెప్టెంబర్ 25(నేటి ప్రస్థానం): తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల కోసం చేపట్టిన కార్యక్రమాలు, రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ మంత్రి ఏపీ అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ సభ్యులుగా ఉన్నారు. ప్రజాస్వామిక విలువల పట్ల నిబద్ధతను కూడా జ్యూరీ పరిగణనలోకి తీసుకున్నట్లు ఫౌండేషన్ వెల్లడించింది. అవార్డు అందుకున్న అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్యదాన్ ముహమ్మద్ వంటి ప్రజా నాయకుడి పేరుతో ఏర్పాటైన పురస్కారం తనకు లభించడం గౌరవంగా

-మిగతా 2 లో..



## కేసుల భారానికి

# చెక్

**తెలంగాణలో మరో 200 కోర్టులకు గ్రీన్ సిగ్నల్!**

**తొలి దశలో 200 జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అనుమతి**

**రాచకొండ పరిధిలోని జిల్లాలకు పెద్ద సంఖ్యలో కొత్త న్యాయస్థానాలు**

**మొత్తం 594 కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు ప్రతిపాదన**

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నేటి ప్రస్థానం): కేసులు పేరుకుపోతున్న కొద్దీ వాటి పరిష్కారానికి ఎదురుచూసే సమయం కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో న్యాయస్థానాల సంఖ్యను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 200 కొత్త జూనియర్ సివిల్ జడ్జి-కమ్ అదనపు

-మిగతా 2 లో..



## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

**హుస్సేన్‌సాగర్‌లో ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం**

**హుస్సేన్‌సాగర్‌లో 69 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతికి నిమజ్జనం**

**టస్కర్‌పై సాగిన భారీ విగ్రహం శోభాయాత్ర**

**పోలీసుల పటిష్ఠ భద్రత మధ్య కార్యక్రమం పూర్తి**

ఖైరతాబాద్, సెప్టెంబర్ 25: హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో పంచముఖ సంకటహర మహాగణపతిగా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం ఖైరతాబాద్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఎన్టీఆర్ మార్గ్ మీదుగా సాగి నిమజ్జన వేదికకు చేరుకుంది. నిమజ్జనానికి ముందు అర్ధరాత్రి నుంచే విగ్రహ దర్శనాలను నిలిపివేశారు. అనంతరం

-మిగతా 2 లో..



## అర్హుల పేర్లు తొలగిస్తున్నారు

**ఓటర్ల జాబితాపై మహేశ్‌కుమార్ గౌడ్ ఫైర్..**

**నోటీసులతో పౌరులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ**

**ఈసీ చీఫ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

నిజామాబాద్, సెప్టెంబర్ 25: నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఓటర్ల జాబితా అంశాన్ని ప్రస్తావించారు. అర్హత ఉన్న పౌరుల పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఓటు

-మిగతా 2 లో..



## గచ్చిబౌలిలో మన్మోహన్ సింగ్

# కాంస్య విగ్రహం

**నేడు విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి**

**తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ పాత్రను మరోసారి గుర్తుచేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** కొన్ని నిర్ణయాలు ఒక కాలానికి మాత్రమే పరిమితం కావు.. వాటి ప్రభావం తరాలు దాటుతుంది. అలాంటి నిర్ణయాలతో దేశ రాజకీయ, ఆర్థిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు హైదరాబాద్‌లో ఇప్పుడు శాశ్వత గుర్తు ఏర్పడుతోంది. తెలంగాణ ఏర్పాటుతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నగరంలో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహం నేడు ఆవిష్కృతం కానుంది. సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా

-మిగతా 2 లో..

## ఎల్లంపల్లి వరదను జలాశయాలకు

# ఎందుకు మళ్లించరు?

**గోదావరి ప్రవాహాన్ని ఉపయోగించుకుని రిజర్వాయర్లు నింపాలన్న హరీశ్‌రావు**

**మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ సహా పలు జలాశయాల పరిస్థితిపై ఆందోళన**

**24 గంటల పాటు పంపులు పనిచేసేలా చూడాలని మంత్రి ఉత్తమ్‌కు లేఖ**



గోదావరిలో నీరు ఉరకలేస్తున్న సమయంలో రిజర్వాయర్లు మాత్రం ఖాళీగా ఎందుకు ఉండాలన్న ప్రశ్నను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు లేవనెత్తారు. ఎల్లంపల్లి వద్ద కొనసాగుతున్న వరద ప్రవాహాన్ని కాళేశ్వరం ఎత్తిపోతల వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్న జలాశయాలకు తరలించాలని కోరారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. వరద నీరు అందుబాటులో ఉన్న ఈ సమయంలో పంపులను పూర్తి సామర్థ్యంతో వినియోగించాలని సూచించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 25(నేటి ప్రస్థానం): గోదావరి నీటిని నిల్వ చేసుకునే ఉద్దేశంతో కాళేశ్వరం వ్యవస్థలో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యంతో వివిధ రిజర్వాయర్లను నిర్మించినట్లు హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం నదిలో నీటి లభ్యత ఉన్నందున ఆ అవకాశాన్ని వినియోగించుకుని జలాశయాల్లో నిల్వలు పెంచాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితులను కారణంగా చూపకుండా అందుబాటులో ఉన్న నీటిని వ్యవసాయ అవసరాలకు మళ్లించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీ స్థాయిలో ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం సుమారు 13 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, మొత్తం 50 టీఎంసీల నిల్వ సామర్థ్యం అందుబాటులో

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 107 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 134 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 208 (కిలో) |
| స్కిన్ లెస్ | 235 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹78

## రూ.2.1 కోట్ల

# లావాదేవీలు..

**ఎమ్మెల్యే గాంధీకి ఈడీ సమన్లు**

**సాహితి ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ కేసులో విచారణకు పిలుపు**

**సెప్టెంబర్ 27న హాజరు కావాలని ఆదేశం**



హైదరాబాద్, సెప్టెంబర్ 25(నేటి ప్రస్థానం): సాహితి ఇన్‌ఫ్రా ఆర్థిక వ్యవహారాల దర్యాప్తు ఇప్పుడు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వరకు చేరింది. సంస్థ నుంచి ఎమ్మెల్యేకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లోకి సుమారు రూ. 2.1 కోట్ల మేర నిధులు వెళ్లినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు ఈడీ పేర్కొంటోంది. ఈ లావాదేవీల వెనుక ఉన్న కారణాలు, వాటి స్వభావం తదితర అంశాలపై వివరణ

-మిగతా 2 లో..



02

## కొంపముంచిన రీల్స్..

**రీల్స్ చేస్తే.. రియల్‌గా దోచేశారు**

**బంగారు, వజ్రాభరణాలతో పాటు నగదు అపహరణ**

## 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు

# నిద్రలేని రాత్రులు

**మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి**

**కేంద్ర హోంమంత్రి అమిత్ షా**



నోయిడా, సెప్టెంబర్ 25 : ఉత్తర్ ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను

-మిగతా 2 లో..

# అర్హుల పేర్లు తొలగిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)



వేసిన పౌరులకు సైతం నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం ఈ వ్యవహా రంలో కుట్రకు పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. దేశ పౌరులుగా ఉన్న వారికి ఓటు హక్కును వినియోగించుకునే అవకా శం కల్పించాల్సిన బాధ్యత అధికారు లపై ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో ఉ ండేలా చూడాలని కోరారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కూడా ఆయన స్పందించారు. ఈసీ ప్రధాన అధికారి పదవి నుంచి తప్పుకోవాల ని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ డిమాండ్ మేరకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఇదిలా ఉండగా నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. గణనాథుడిని సాగనంపే సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మేలు జరగాలని, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర రంగాల్లో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలని కోరుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు కాంగ్రెస్‌కు కొనసాగాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణపై తెలంగాణ కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. మహేశ్‌కుమార్ గౌడ్ తాజా వ్యాఖ్యలు ఆ రాజకీయ అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చాయి.



# రూ.2.1 కోట్ల లావాదేవీలు..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునేందుకు గాంధీకి సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 27న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసులు, ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన వ్యవహారంపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు కొనసాగిస్తోంది. ఫ్లాట్లు, విల్లాలు నిర్మిస్తామని చెప్పి ప్రీ-లాంచ్ పథకాల ద్వారా కొనుగోలుదారుల నుంచి డబ్బులు సమీకరించి మళ్లించినట్లు సంస్థపై ఆరోపణలు ఉన్నాయి.

## రూ.248 కోట్ల నుంచి రూ.842 కోట్లకు..

సాహితి ఇన్‌ఫ్రా వ్యవహారంలో తొలిదశలో సుమారు రూ.248 కోట్ల మేర మోసం జరిగినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. దర్యాప్తు విస్తరించిన తరువాత ఆ మొత్తం సుమారు రూ.842 కోట్లకు చేరినట్లు ఈడీ అంచనా వేసింది. సేకరించిన నిధుల్లో కొంత భాగం సంస్థకు సంబంధించిన వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. సుమారు రూ.126 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలోనే గాంధీకి సంబంధించిన ఖాతాల్లోకి చేరినట్లు చెబుతున్న రూ.2.1 కోట్లపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆ మొత్తాల బదిలీకి కారణం ఏమిటి, వాటికి సంబంధించిన ఆర్థిక సంబంధాలు ఏంటి, లావాదేవీలకు చట్టబద్ధమైన ఆధారం ఉందా అనే అంశాలను విచారణలో పరిశీలించనున్నట్లు సమాచారం. సాహితి ఇన్‌ఫ్రా నిధుల ప్రవాహంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఇతర ఆస్తులు, లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

## ఆస్తులు, ఖాతాలపైనా చర్యలు

కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు 56 బ్యాంకు ఖాతాలను ఈడీ ఫ్రీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో సుమారు రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయగా, తదుపరి దశలో మరో రూ.12.6 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలిపారు. బినామీ పేర్లతో ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన అంశాలను కూడా దర్యాప్తు సంస్థ పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.

## సంస్థ ఎండీ అరెస్టు.. విచారణ కొనసాగింపు

సాహితి ఇన్‌ఫ్రా కేసులో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి. లక్ష్మీనారాయణతో పాటు మాజీ డైరెక్టర్ సందు పూర్ణచంద్రరావు తదితరులపై దర్యాప్తు కొనసాగుతోంది. సంస్థ ఎండీ లక్ష్మీనారాయణను 2024 సెప్టెంబర్‌లో ఈడీ అరెస్టు చేసింది. సాహితి ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల ప్రచార కార్యక్రమాల్లో కనిపించిన నటుడు జగపతిబాబును కూడా గతంలో సాక్షిగా విచారించినట్లు అధికారులు వెల్లడించారు. తాజాగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి సమన్లు జారీ కావడంతో కేసులో మరో కీలక విచారణ దశకు చేరుకుంది. సెప్టెంబర్ 27న జరిగే విచారణలో రూ.2.1 కోట్లుగా పేర్కొంటున్న లావాదేవీలపై ఈడీ అధికారులు వివరాలు కోరనున్నట్లు సమాచారం. ఆ విచారణలో వెలువడే సమాచారం ఆధారంగా దర్యాప్తు తదుపరి దశ ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# కేరళ గడ్డపై సీఎం రేవంత్‌కు అరుదైన గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

భావిస్తున్నాన న్నారు. తనను ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కేరళతో తనకు ఉన్న అనుబంధాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## కేరళతో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం

కేరళ పర్యటనల సందర్భంగా అక్కడి ప్రజలు తనపై చూపిన ఆదరణను రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కేరళకు వచ్చిన విషయాన్ని, అనంతరం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ రాష్ట్రంలో పర్యటించిన సందర్భాలను గుర్తుచేశారు. కేరళ ప్రజలు లౌకిక విలువలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఆయన ప్రస్తావిస్తూ అభినందనలు తెలిపారు. దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ రాజకీయ జీవితాన్ని కూడా సీఎం గుర్తుచేసుకున్నారు. నిలంబూర్ నుంచి ఆయన ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, కేరళలోని నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. ప్రజా జీవితం, ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను ప్రస్తావించారు.

## ఆర్యదాన్ స్ఫూర్తిని కొనసాగించాలి

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ఆర్యదాన్ ముహమ్మద్ చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవలను స్మరించుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్ ఆర్యదాన్ షౌకత్, కేరళకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఈ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు.



# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

(మొదటిపేజీ తరువాయి)

మండపం, షెడ్లు, బ్యారికేడ్లను తొలగించి మహాగణపతిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక టస్కర్ వాహనంపై విగ్రహాన్ని ఎక్కించి శోభాయాత్రకు సిద్ధం చేశారు. అయితే విగ్రహాన్ని తరలించే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో శోభాయాత్ర నిర్ణయించిన సమయానికి ప్రారంభం కాలేదు. దాదాపు మూడున్నర గంటల ఆలస్యంతో ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఊరేగింపు మొదలైంది. రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. మహాగణపతిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఖైరతాబాద్ పరిసరాల్లో సందడి నెలకొంది. మరోవైపు నిమజ్జన మార్గంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. ప్రధాన ఊరేగింపు మార్గాల్లో విగ్రహాలను తరలించే వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా నగరవ్యాప్తంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 20 వేల మంది పోలీసులను విధుల్లో మోహరించడంతో పాటు ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన వేలాది సీసీటీవీలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. చివరికి ఖైరతాబాద్ మహాగణపతి హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం కావడంతో ఈ ఏడాది ఉత్సవాలకు అధికారికంగా ముగింపు పలికినట్లైంది. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు కూడా కొనసాగాయి.





# ఎల్లంపల్లి వరదను జలాశయాలకు ఎందుకు మళ్లించరు?

(మొదటిపేజీ తరువాయి)

ఉందని తెలిపారు. మల్లన్నసాగర్ పూర్తిగా నిండితే హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు తోడ్పడటంతో పాటు మూసీ ప్రాజెక్టుకు కూడా నీటిని తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. కొండపోచమ్మసాగర్ పరిస్థితినీ ఆయన ప్రస్తావించారు. 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ రిజర్వాయర్‌లో ప్రస్తుతం సుమారు 6 టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకూ ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

## పలు జిల్లాలకు ప్రయోజనం

ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు కొనసాగిస్తే మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గంధమల్ల, బస్వాపూర్ వంటి జలాశయాలకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని హరీశ్‌రావు తెలిపారు. దీనివల్ల సుమారు ఐదు లక్షల ఎకరాల సాగుకు తోడ్పాటు లభించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. మిడ్‌మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాంలోనూ ప్రస్తుతం సుమారు 11 టీఎంసీల నీరు మాత్రమే ఉందని ఆయన తెలిపారు. అక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలను కొంతమేర తీర్చవచ్చని వివరించారు. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు దీనివల్ల ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

## పామాయిల్ పరిశ్రమకూ నీటి సమస్య



సిద్దిపేట జిల్లా నర్మెట్టలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని హరీశ్‌రావు తన లేఖలో ప్రస్తావించారు. పరిశ్రమ అవసరాల కోసం రంగనాయకసాగర్ నుంచి నీటిని తరలించేలా అప్పట్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ రిజర్వాయర్‌లో తగినంత నీరు లేకపోవడంతో ఫ్యాక్టరీ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గోదావరిలో భారీ ప్రవాహం ఉన్నప్పటికీ ఎత్తిపోతల వ్యవస్థను పూర్తిస్థాయిలో ఉపయోగించకపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. జలాశయాల్లో నిల్వలు తగ్గిపోతున్న పరిస్థితికి నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఖరే కారణమని ఆయన విమర్శించారు. రాజకీయ అంశాలను పక్కనపెట్టి ప్రస్తుతం లభిస్తున్న గోదావరి జలాలను రైతుల అవసరాలకు వినియోగించాలని, ప్రకృతి పరిస్థితులను సాకుగా చూపకుండా సాగునీటి విషయంలో ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు.

# కేసుల భారానికి చెక్..

(మొదటిపేజీ తరువాయి)

జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి బీ. పాపిరెడ్డి, ఆర్థిక శాఖ సమ్మతితో జీవో ఎంఎస్ నంబర్ 59 జారీ చేశారు. రాష్ట్రంలో న్యాయస్థానాలపై పెరుగుతున్న పని భారాన్ని దృష్టిలో ఉంచుకుని అదనంగా 594 కోర్టులు ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ఆ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం మొత్తం డిమాండ్‌లో మొదటి దశగా 200 కోర్టులను మంజూరు చేసింది.

## రంగారెడ్డికి అత్యధికం

కొత్తగా ఏర్పాటు కానున్న కోర్టుల్లో అత్యధిక వాటా రంగారెడ్డి జిల్లాకు దక్కింది. జిల్లాలో మొత్తం 30 న్యాయస్థానాలు ఏర్పాటు చేయనున్నారు. రాజేంద్రనగర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమన్‌గల్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు నిర్ణయించారు. ఆ తర్వాతి స్థానంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉంది. ఈ జిల్లాకు 25 కోర్టులు కేటాయించారు. మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ ప్రాంతాల్లో కొత్త న్యాయస్థానాలు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌లోని సిటీ సివిల్, సెషన్స్ కోర్టుల పరిధిలో మరో 16 కోర్టులు ఏర్పాటు కానున్నాయి.

## పలు జిల్లాలకు కొత్త కోర్టులు

ఉమ్మడి అవసరాలు, కేసుల భారాన్ని పరిగణనలోకి తీసుకుని ఇతర జిల్లాలకూ న్యాయస్థానాలు మంజూరు చేశారు. నల్గొండకు 10, ఖమ్మంకు 8, సంగారెడ్డికి 8, కరీంనగర్‌కు 7, సూర్యాపేటకు 7 కోర్టుల చొప్పున కేటాయించారు. అదేవిధంగా నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు 6 చొప్పున, సిద్దిపేట, మంచిర్యాల జిల్లాలకు 5 చొప్పున కొత్త కోర్టులు రానున్నాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి మరో 12 న్యాయస్థానాలకు అనుమతి లభించింది. కొత్త కోర్టుల ఏర్పాటుతో కింది స్థాయి న్యాయస్థానాలపై ఉన్న భారాన్ని కొంత మేర తగ్గించడంతో పాటు కేసుల విచారణకు అదనపు వసతులు అందుబాటులోకి రానున్నాయి. మొత్తం 594 కోర్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలో ఇది తొలి దశ కాగా, మిగిలిన కోర్టుల అంశంపై తదుపరి నిర్ణయాలు వెలువడాల్సి ఉంది.

# 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

(మొదటిపేజీ తరువాయి)

నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.



# కొంపముంచిన రీల్స్..

- రీల్స్ చేస్తే.. రియల్‌గా దోచేశారు
- బంగారు, వజ్రాభరణాలతో పాటు నగదు అపహరణ

**చెన్నై:** తమిళనాడు, కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని తమ్మత్తుకోణం ప్రాంతంలో యూట్యూబర్ మధుమిత, ఆమె భర్త వినోద్‌కుమార్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వజ్రాభరణాలతో పాటు పెద్ద ఎత్తున నగదును అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన గురువారం సాయంత్రం నుంచి రాత్రి మధ్య చోటుచేసుకుంది. మధుమిత, వినోద్‌కుమార్ తమ కూతురితో కలిసి గురువారం సాయంత్రం దుస్తులు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చిన తర్వాత పడకగదిలోని బీరువా పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. అందులో ఉంచిన బంగారు, వజ్రాభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటి వెనుక తలుపు తాళాన్ని కటింగ్ యంత్రంతో కోసి దుండగుడు లోపలికి ప్రవేశించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అనంతరం పడకగదిలోని బీరువా తాళాన్ని పగులగొట్టి అందులో ఉన్న నగలు, నగదును తీసుకెళ్లినట్లు గుర్తించారు. మధుమిత సామాజిక మాధ్యమాల్లో నగదు, బంగారు ఆభరణాలను చూపిస్తూ గతంలో పలు వీడియోలు చేసినట్లు స్థానిక కథనాలు పేర్కొన్నాయి. ఆ వీడియోలు కూడా చోరీకి సంబంధించిన దర్యాప్తులో పరిశీలనకు వస్తున్నట్లు సమాచారం. అయితే చోరీకి వీడియోలే కారణమని నిర్ధారించే ఆధారాలు ఇంకా వెల్లడికాలేదు. సమాచారం అందుకున్న రాజాక్కమంగళం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను సేకరించి పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం 3 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. దొంగిలించిన ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను గుర్తించడం దర్యాప్తులో తదుపరి కీలక అంశంగా ఉంది.



## బాలాపూర్ లడ్డూ వేలం

# రూ.39 లక్షలు!

- సామ ప్రణీత్ రెడ్డికి బాలాపూర్ గణేశుడి లడ్డూ సొంతం
- తొమ్మిది మంది మధ్య ఉత్కంఠగా సాగిన వేలం
- రూ.35 లక్షల గత రికార్డు బద్దలు.. ఈసారి రూ.4 లక్షలు పెరిగిన వేలం ధర

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** బాలాపూర్ గణేశుడి లడ్డూ ప్రసాదం మరోసారి వార్తల్లో నిలిచింది. శుక్రవారం నిర్వహించిన వేలంలో ఈసారి ఏకంగా రూ.39 లక్షల ధర పలికింది. సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి అత్యధిక బిడ్ దాఖలు చేసి లడ్డూను దక్కించుకున్నారు. దీంతో గతేడాది నమోదైన రూ.35 లక్షల ధరను అధిగమించి కొత్త రికార్డు నమోదైంది. బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ప్రారంభ బిడ్‌ను రూ.1,116గా నిర్ణయించగా.. అనంతరం పోటీ తీవ్రంగా సాగింది. మొత్తం తొమ్మిది మంది బిడ్డింగ్‌లో పాల్గొన్నారు. బిడ్డర్లు వరుసగా ధర పెంచడంతో వేలం ఉత్కంఠగా మారింది. చివరికి సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలతో అత్యధిక బిడ్ వేసి విజేతగా నిలిచారు. ఈ ఏడాది వేలంలో స్థానికులతో పాటు లండన్‌కు చెందిన ఓ వ్యక్తి కూడా పాల్గొన్నట్లు రిపోర్టులు వెల్లడించాయి. దీంతో బాలాపూర్ లడ్డూ వేలానికి ఉన్న ఆదరణ మరోసారి చర్చనీయాంశమైంది. గత ఏడాది రూ.35 లక్షలకు లడ్డూ విక్రయమవగా.. ఈసారి మరో రూ.4 లక్షలు పెరిగింది. బాలాపూర్ లడ్డూను సొంతం చేసుకుంటే శుభం, ఐశ్వర్యం, ఆరోగ్యం కలుగుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. 1994లో రూ.450తో ప్రారంభమైన ఈ వేలం సంప్రదాయం ప్రస్తుతం లక్షల రూపాయల స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది లడ్డూ వేలం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా మారుతోంది. వేలం పూర్తయిన తర్వాత రూ.39 లక్షలకు లడ్డూను దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డికి నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది బాలాపూర్ లడ్డూ వేలం మరోసారి రికార్డు స్థాయిలో ముగియడంతో భక్తుల్లో ఆసక్తి నెలకొంది.




## కేంద్ర పథకాలు..

# ఇక జాప్యం వద్దు

- ఎంపీ రఘునందన్ రావు
- కేంద్ర నిధులతో చేపట్టిన పనులపై ఎంపీ సమీక్ష
- రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యంపై అధికారులకు సూచనలు
- నాణ్యతతో పనులు పూర్తి చేయాలని స్పష్టం
- పెండింగ్ పనులపై తదుపరి సమావేశానికి నివేదిక ఇవ్వాలని ఆదేశం

**మెదక్, సెప్టెంబర్ 25:** కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మెదక్ జిల్లాకు మంజూరవుతున్న నిధులు, వాటితో చేపడుతున్న అభివృద్ధి పనులపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సమగ్రంగా సమీక్ష జరిగింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన 'దిశ' సమావేశానికి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ, గృహ నిర్మాణం, విద్యుత్, మహిళా-శిశు సంక్షేమం, సామాజిక సంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్ అభివృద్ధి తదితర రంగాలపై ఎంపీ సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం కలిగించే ప్రభుత్వ పథకాల్లో ఆలస్యం ఉండకూడదని రఘునందన్ రావు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థలను మెరుగుపర్చాలని అన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ కార్యక్రమంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రామ్‌జీ బీవీ పథకం కింద చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు. ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాలో సమస్యలు తలెత్తిన సందర్భాల్లో సంబంధిత శాఖలు వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాకు అందుతున్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని రఘునందన్ రావు అన్నారు. మంజూరైన నిధులు వృథా కాకుండా నిర్ణీత గడువులో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రజలకు అందించాలని సూచించారు. ఎంపీ సూచించిన అంశాలపై చర్యలు తీసుకుని, తదుపరి దిశ సమావేశం నాటికి పెండింగ్ పనుల పురోగతిని స్పష్టంగా చూపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, దిశ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కర్ణాటకలో అనుమానిత ఉగ్రవాది అరెస్టు

**చిక్కబళ్లాపుర:** ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ తదితరులను లక్ష్యంగా చేసుకుని దాడి చేసేందుకు టెలిగ్రాం గ్రూపుల్లో చర్చించడం, నగదు సమీకరణకు ప్రయత్నిస్తున్న ఆరోపణలపై అనుమానిత ఉగ్రవాది షబ్బీర్‌ను కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపుర నగర పోలీసులు అరెస్టు చేశారు. బాపూజీనగర్‌కు చెందిన షబ్బీర్.. ధనవంతులు, వారి పిల్లలను అపహరించడం ద్వారా నగదు సమీకరించవచ్చని టెలిగ్రాం గ్రూపుల్లో చర్చలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేంద్ర నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఆపరేషన్ నిర్వహించి షబ్బీర్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఈ టెలిగ్రాం గ్రూపులో సభ్యులుగా ఉన్నారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలను సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గచ్చిబౌలి వేదికగా

# మరో చారిత్రక ఘట్టం

- మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ చేయనున్న సీఎం రేవంత్
- గచ్చిబౌలిలో కాంస్య విగ్రహం ఏర్పాటు
- నేడు విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం
- తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ పాత్రను మరోసారి గుర్తుచేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం





**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** కొన్ని నిర్ణయాలు ఒక కాలానికి మాత్రమే పరిమితం కావు.. వాటి ప్రభావం తరాలు దాటుతుంది. అలాంటి నిర్ణయాలతో దేశ రాజకీయ, ఆర్థిక చరిత్రలో తనదైన ముద్ర వేసిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు హైదరాబాద్‌లో ఇప్పుడు శాశ్వత గుర్తు ఏర్పడుతోంది. తెలంగాణ ఏర్పాటుతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నగరంలో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహం నేడు ఆవిష్కృతం కానుంది. సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశ ప్రధానిగా, ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ తీసుకున్న నిర్ణయాలు ఆయన రాజకీయ జీవితంలో కీలక అధ్యాయాలుగా నిలిచాయి. ముఖ్యంగా 1991లో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సమయంలో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు దారితీశాయి. అనంతరం 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా కొనసాగిన ఆయన హయాంలో పలు సంక్షేమ, సామాజిక కార్యక్రమాలు అమల్లోకి వచ్చాయి. అయితే తెలంగాణకు సంబంధించిన అంశంలో మన్మోహన్ సింగ్ పేరు మరో కారణంతో ప్రత్యేకంగా ప్రస్తావనకు వస్తుంది. ప్రత్యేక రాష్ట్రం కోసం దశాబ్దాలుగా సాగిన ఉద్యమం చివరకు పార్లమెంటరీ ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు దారి తీసింది. ఈ నేపథ్యంలో మన్మోహన్ సింగ్‌కు తెలంగాణలో స్మారక గుర్తు ఏర్పాటు చేయాలని రాష్ట్ర శాసనసభ గతంలో నిర్ణయించింది. ఆ నిర్ణయానికి కొనసాగింపుగానే హైదరాబాద్‌లో విగ్రహం ఏర్పాటు చేసే ప్రక్రియ ముందుకు సాగింది. సైబరాబాద్ ప్రాంతంలో విగ్రహంతో పాటు సంబంధిత జంక్షన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర ప్రభుత్వ సమాచారం వెల్లడించింది. ఇక ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ముందుగా హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలను గుర్తు చేసుకున్నారు. దేశ ఆర్థిక ప్రగతికి ఆయన అందించిన దిశానిర్దేశం, ప్రజాసేవలో చూపిన నిబద్ధత, సాదాసీదా జీవన విధానం వంటి అంశాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. గచ్చిబౌలిలో ఏర్పాటు చేస్తున్న విగ్రహం కేవలం ఒక విగ్రహంగా కాకుండా.. దేశ అభివృద్ధిలో మన్మోహన్ సింగ్ చేసిన కృషికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్థిక రంగంలో మన్మోహన్ సింగ్ తీసుకొచ్చిన మార్పులు భారతదేశ ప్రస్థానంలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. 1991లో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఆయన చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపాయని అన్నారు. అనంతరం 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా కొనసాగిన కాలంలో అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యం ఇచ్చారని గుర్తుచేశారు. అదే సమయంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటి కీలక కార్యక్రమాలు అమలులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఇలా ఒకప్పుడు పార్లమెంట్‌లో తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు హైదరాబాద్‌లోని ఒక ప్రాంతానికి శాశ్వత గుర్తుగా మారుతున్నాయి. గచ్చిబౌలి పరిసరాల్లో ఏర్పాటు చేసిన మన్మోహన్ సింగ్ విగ్రహం ద్వారా ఆయన రాజకీయ, ఆర్థిక ప్రస్థానంతో పాటు తెలంగాణతో ఉన్న అనుబంధాన్ని కూడా భవిష్యత్ తరాలకు గుర్తు చేసే ప్రయత్నం జరుగుతోంది. నేడు జరిగే విగ్రహావిష్కరణతో ఈ ప్రక్రియ మరో కీలక దశకు చేరనుంది.

## వరంగల్‌పై సీఎం రేవంత్‌కు

# ఎంపీ కడియం కావ్య వినతి

- పీఎం-ఉషా నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- వరంగల్ కోట మ్యూజియానికి కేంద్రం నుంచి రూ.10 కోట్లు కోరిన ఎంపీ
- నైలిట్, సీఐటీడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- వరంగల్‌లో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోసం డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలపై ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టాల్సిన పనులు, కొత్త సంస్థల ఏర్పాటు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, ప్రజలకు అవసరమైన కేంద్ర ప్రభుత్వ సేవల విస్తరణ వంటి అంశాలపై సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయా అంశాలపై సంబంధిత శాఖలతో చర్చించి ముందుకు వెళ్లాలని కోరారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని కావ్య కోరారు. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన, మౌలిక వసతులను మరింత మెరుగుపర్చేందుకు ఈ నిధులు అవసరమని తెలిపారు. వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్ల నిధులు సాధించేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరపాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. కొత్త మ్యూజియం భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన, భద్రత, వాతావరణ నియంత్రణ తదితర ఏర్పాట్లు చేయాల్సి ఉందని వివరించారు. వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ వంటి విభాగాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు శిక్షణ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ కేంద్రాన్ని కూడా వరంగల్‌కు తీసుకురావాలని ఎంపీ ప్రతిపాదించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు స్థానిక ఎంఎస్‌ఎంఈలకు ఈ సంస్థ ద్వారా ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఆధునిక తయారీ, డిజైన్, రోబోటిక్స్, ఆటోమేషన్, 3డీ ప్రింటింగ్ వంటి రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి ఇది దోహదపడుతుందని వివరించారు. వరంగల్‌లో ప్రస్తుతం పనిచేస్తున్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కూడా కోరారు. వరంగల్-హనుమకొండ-కాజీపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజలకు మెరుగైన సేవలు అందేలా తగిన మౌలిక వసతులు, సిబ్బందితో పీఎస్‌కే ఏర్పాటు చేయాలని కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని సీఎంను కోరారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఎంపీ కావ్య ప్రస్తావించిన ప్రతిపాదనలపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. సంబంధిత శాఖలతో చర్చించి కేంద్రంతో సమన్వయం చేస్తూ చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



# 22ఏలోకి ఎలా వెళ్లాయి?

## అనంతారం భూములపై రైతుల ఆందోళన

- 173, 174 సర్వే నంబర్లపై పాత రెవెన్యూ దస్తావేజులు పరిశీలించాలని డిమాండ్
- 150 మందికిపైగా రైతులకు ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపాలని విజ్ఞప్తి
- అర్హత ఉన్న పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరిన గోవర్ధన్‌రెడ్డి

**గుమ్మడిదల, సెప్టెంబర్ 25 (నేటి ప్రస్థానం):** తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములపై ఒక్కసారిగా ఆంక్షలు రావడంతో అనంతారం రైతుల్లో ఆందోళన నెలకొంది. భూముల స్వభావాన్ని నిర్ధారించేందుకు పాత రెవెన్యూ దస్తావేజులు, పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, న్యాయస్థాన ఉత్తర్వులను సమగ్రంగా పరిశీలించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సర్వే నంబర్లు 173, 174 పరిధిలోని భూముల అంశాన్ని పరిశీలించి అర్హత కలిగిన భూములకు 22ఏ ఆంక్షల నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతారం గ్రామంలో సర్వే నంబర్ 173 కింద మొత్తం 59 ఎకరాల విస్తీర్ణం ఉందని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ భూమి పూర్తిగా పట్టా భూమి అని పేర్కొన్నారు. సర్వే నంబర్ 174లో 110 ఎకరాల 21 గుంటలు ఉండగా.. అందులో 21 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి, మిగిలినది పట్టా భూమిగా ఉందని వివరించారు. సర్వే నంబర్ 174కు సంబంధించిన భూముల వెనుక ఉన్న చరిత్రను కూడా ఆయన ప్రస్తావించారు. ఇందులో 39.19 ఎకరాలను 1965లో అప్పటి ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల కోటా కింద కేటాయించిందన్నారు. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆ భూములకు విక్రయ హక్కులు కల్పించగా.. 1975లో స్థానికంగా ఉన్న పేద రైతులకు వాటిని విక్రయించినట్లు తెలిపారు. అదే సర్వే నంబర్‌లో మరో సుమారు 50 ఎకరాలను కూడా 1965లో అప్పటి ప్రభుత్వం గ్రామంలోని పేద రైతులకు కేటాయించిందని గోవర్ధన్‌రెడ్డి వివరించారు. ఈ భూములకు సంబంధించి 1978--79 కాలానికి చెందిన రెవెన్యూ దస్తావేజుల్లో లబ్ధిదారుల పేర్లు నమోదై ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం గతంలోనే పట్టాలు మంజూరు చేయడం, రిజిస్ట్రేషన్లు నిర్వహించడం వంటి ప్రక్రియలు పూర్తిచేసిన తర్వాత ఇప్పుడు ఆయా భూములను 22ఏ పరిధిలోకి తీసుకురావడం వల్ల రైతులు తమ ఆస్తులపై లావాదేవీలు, హక్కుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం 173, 174 సర్వే నంబర్ల పరిధిలో 150 మందికిపైగా రైతులు భూములను సాగు చేస్తున్నారని గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. భూముల అసలు స్థితిని తేల్చేందుకు కేటాయింపుల నుంచి ఇప్పటివరకు నమోదైన అన్ని రెవెన్యూ వివరాలను పరిశీలించాలని కోరారు. పట్టాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, కోర్టు ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రైతుల వద్ద ఉన్న ఆధారాలను అధికార యంత్రాంగం పరిశీలించి, చట్టపరంగా అర్హత కలిగిన పట్టా భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి బయటకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ తక్షణ దృష్టి సారించి రైతులకు స్పష్టత కల్పించాలని కోరారు. సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తే రైతుల తరఫున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని గోవర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామ సర్పంచ్ శ్రీను, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు కుమార్‌గౌడ్, చక్రపాణి, గ్రామ నాయకుడు జింక గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫామ్ పాండ్‌తో నీటి నిల్వ..

## రైతులకు ఉద్యాన శాఖ సూచనలు

- వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఫామ్ పాండ్‌లతో ప్రయోజనం
- అవసరమైన సమయంలో నిల్వ నీటిని పంటలకు వినియోగించే అవకాశం
- టమాటాలో స్టేకింగ్‌తో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్న అధికారులు



**గుమ్మడిదల, సెప్టెంబర్ 25 (నేటి ప్రస్థానం):** వర్షం పడినప్పుడే నీరు దొరుకుతుంది.. కానీ పంటకు అవసరమైన సమయానికి నీటి కొరత ఎదురైతే రైతుకు ఇబ్బందులు తప్పవు. ఈ సమస్యకు ముందస్తు పరిష్కారంగా పొలాల్లో ఫామ్ పాండ్‌లను ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారులు సూచించారు. నిల్వ చేసిన నీటిని పంటకు అవసరమైన దశలో ఉపయోగించుకోవచ్చని తెలిపారు. నాగిరెడ్డిగూడెం గ్రామంలో రైతు సురేందర్‌రెడ్డి పొలంలో ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి. సోమేశ్వరరావు, డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జి. అనూషారెడ్డి పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యతను ముందుగానే మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు తమ పొలాల్లో వర్షపు నీటిని ఒడిసిపట్టే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఫామ్ పాండ్‌లో నిల్వ చేసిన నీటిని పంటకు నీరు అవసరమైన సమయంలో ఉపయోగించుకోవడం ద్వారా సాగుకు కొంత భరోసా ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం రైతు సుధాకర్‌రెడ్డి పొలంలో సాగవుతున్న టమాటా పంటను అధికారులు పరిశీలించారు. పంట మొక్కలకు మద్దతుగా ఏర్పాటు చేసిన స్టేకింగ్ విధానాన్ని పరిశీలించి, దాని వల్ల కలిగే ప్రయోజనాలను రైతుకు వివరించారు. కూరగాయల సాగులో స్టేకింగ్ పద్ధతిని అనుసరించడం వల్ల టమాటా మొక్కలను సక్రమంగా పెంచుకోవడంతో పాటు పంటను ఎక్కువ కాలం కొనసాగించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. మొక్కలకు తగిన మద్దతు కల్పించడం ద్వారా నాణ్యమైన టమాటా ఉత్పత్తి సాధించవచ్చని పేర్కొన్నారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చిన ఉత్పత్తులకు మార్కెట్‌లో మెరుగైన ధర లభించే అవకాశాలు ఉంటాయని అధికారులు వివరించారు. రైతులు సంప్రదాయ పద్ధతులతో పాటు పంటకు అనుకూలమైన ఆధునిక సాగు విధానాలను కూడా అనుసరించాలని సూచించారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# ఓటు హక్కు ఉందా..

## జాబితాలో పేరు ఉందో చూసుకోండి!

**అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి: సీఈవో సుదర్శన్‌రెడ్డి**

**తాండూర్‌లో పోలింగ్ కేంద్రాల తనిఖీ.. బీఎల్‌వోల పనితీరుపై ఆరా**

**వికారాబాద్‌లో 72 శాతం నోటీసుల పంపిణీ పూర్తి**

**వికారాబాద్, సెప్టెంబర్ 25(నేటి ప్రస్థానం):** ఓటు వేయాలంటే ముందుగా ఓటర్ల జాబితాలో పేరు ఉండాలి.. పేరు లేకపోతే అర్హత ఉన్నా ఎన్నికల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదయ్యే అవకాశాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా శుక్రవారం తాండూర్ నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి ఏర్పాట్లను పరిశీలించారు. తాండూర్ పట్టణంలోని పాత మున్సిపాలిటీ, ఎంపీటీ హాల్, గౌతాపూర్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సీఈవో సందర్శించారు. అక్కడ బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న వివిధ పనులపై వివరాలు తెలుసుకున్నారు. ఓటర్ల నమోదు, జారీ చేసిన నోటీసులు, వాటికి సంబంధించిన పత్రాల స్వీకరణ, వివరాల ధ్రువీకరణ తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 60 శాతం మంది ఓటర్లకు నోటీసులు చేరినట్లు సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం ఈ ప్రక్రియ 72 శాతం మేర పూర్తయిందని తెలిపారు. నోటీసులు అందుకున్నవారు వాటిలో సూచించిన వివరాలను పరిశీలించి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సంబంధిత అధికారులకు అందించాలని సూచించారు.

### నమోదు కోసం రెండు మార్గాలు

ఓటరుగా అర్హత ఉన్న వారు తప్పనిసరిగా జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సీఈవో సూచించారు. ఇందుకోసం ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని వివరించారు. ఆన్‌లైన్ ప్రక్రియపై అవగాహన లేని వారు తమ ప్రాంతంలోని బూత్ స్థాయి అధికారులను సంప్రదించి వారి సహకారంతో నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. తాండూర్ ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో నమోదవుతున్న వివరాలు, నోటీసులకు సంబంధించిన ప్రక్రియ సక్రమంగా కొనసాగుతున్న తీరును అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్, ఆర్డీవో అనిత, తహసీల్దార్ తారా సింగ్, డీఎస్పీ నర్సింగ్ యాదయ్యతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# క్వారీలపై ఫిర్యాదులు..

# అధికారుల స్పందన ఎక్కడ?

- పేలుళ్ల దాటికి ఇళ్లకు నష్టం.. భారీగా తవ్వకాలతో భద్రతపై ఆందోళన
- క్రషర్ లారీలతో రహదారులు ఛిద్రం.. దుమ్ము కాలుష్యంతో ప్రజలకు అవస్థలు
- అనుమతులు, హద్దులు, తవ్వకాలపై సమగ్ర తనిఖీలు చేయాలని కౌన్సిలర్ల డిమాండ్



**మేడ్చల్, సెప్టెంబర్ 25 (నేటి ప్రస్థానం):** ఒకవైపు కొండలను తొలిచేస్తున్న తవ్వకాలు.. మరోవైపు రాళ్లను పేల్చే ప్రకంపనలు.. ఇంకోవైపు క్రషర్ వాహనాల రాకపోకలతో దెబ్బతింటున్న రహదారులు. వీటన్నింటి మధ్య ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం, బండమాదారం రెవెన్యూ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ర్యాక్ సాండ్ క్రషర్, ఐజేఎం క్రషర్‌కు అనుబంధంగా ఉన్న క్వారీలపై ఇప్పటికే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా సమస్యలపై మైనింగ్ శాఖ నుంచి ఆశించిన స్థాయి-ంలో స్పందన లేదని ఆరోపించారు. ర్యాక్ సాండ్ క్రషర్ పరిధిలోని క్వారీల్లో రాళ్లను పేల్చే సమయంలో వస్తున్న ప్రకంపనలతో సమీప నివాసాల్లోని గోడలు దెబ్బతింటున్నాయని కౌన్సిలర్లు తెలిపారు. కొన్ని ఇళ్లలో గోడలకు పగుళ్లు రావడంతో పాటు పైకప్పులు, గోడల నుంచి పెచ్చులు రాలుతున్నాయని పేర్కొన్నారు. పేలుళ్ల సమయంలో ఇళ్లలో ఉండే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, ఈ అంశాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించి క్వారీల్లో పేలుళ్ల విధానం, తీవ్రతపై తనిఖీ చేయాలని కోరారు.

### లోతైన తవ్వకాలపై ఆందోళన



ఐజేఎం క్రషర్‌కు సంబంధించిన క్వారీ ప్రాంతాల్లో పెద్దఎత్తున రాతి తవ్వకాలు సాగుతున్నాయని కౌన్సిలర్లు ఆరోపించారు. కొన్ని చోట్ల సుమారు 200 నుంచి 300 అడుగుల మేర లోతుగా తవ్విన ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. తవ్వకాలు జరిగిన ప్రదేశాల వద్ద రక్షణ ఏర్పాట్లు సరిపడా లేకపోవడంతో అక్కడికి వెళ్లే రైతులు, పశువులు, స్థానికులకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లోతైన గుంతల చుట్టూ భద్రతా చర్యలు ఉన్నాయా లేదా అన్నదానిపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని కోరారు.

### లారీల రాకతో రహదారులకు దెబ్బ



క్వారీల నుంచి క్రషర్ యూనిట్లకు రాళ్లు తరలించే భారీ వాహనాల కారణంగా స్థానిక రహదారులు దెబ్బతింటున్నాయని కౌన్సిలర్లు తెలిపారు. నిరంతర వాహనాల రాకపోకలతో పలుచోట్ల రోడ్లు గుంతలుగా మారి ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. దీంతో ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని తెలిపారు. మరోవైపు క్రషర్ కార్యకలాపాల సమయంలో వెలువడే దుమ్ము, ధూళి పరిసర ప్రాంతాల్లో వ్యాపిస్తుండటంతో వాతావరణ కాలుష్యం పెరుగుతోందని ఆరోపించారు. రహదారుల వెంట, నివాస ప్రాంతాల సమీపంలో కాలుష్య నియంత్రణ చర్యలు పాటిస్తున్నారా లేదా పరిశీలించాలని అధికారులను కోరారు. క్వారీలకు మంజూరైన అనుమతులు, నిర్దేశించిన పరిధి, తవ్వకాలకు అనుమతించిన లోతు, పేలుళ్ల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, పర్యావరణ నిబంధనల అమలుపై సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని కౌన్సిలర్లు కోరారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రజావాణి ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినందున ఇకనైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల భద్రత, నివాస ప్రాంతాల రక్షణ, రహదారుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు వెంటనే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కత్తి వరలక్ష్మి సురేందర్, దాది నర్సింహా, ఓం ప్రకాష్ గౌడ్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి

- మైత్రినగర్‌లో పుష్పాంజలి
- మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

**శేరిలింగంపల్లి :** మదీనాగూడ, హఫీజ్‌పేట్ డివిజన్లలో బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మదీనాగూడ డివిజన్ అధ్యక్షుడు రాజు యాదవ్, హఫీజ్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో మైత్రినగర్ కమాన్ వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మైత్రినగర్ పార్కులో 'ఏక్ పేడ్ మాకే నామ్' నినాదంతో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అజిత్‌కుమార్ సేనాపతి, రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. అంత్యోదయ భావన, ఏకాత్మ మానవవాద సిద్ధాంతాల ద్వారా భారతీయ రాజకీయ, సామాజిక ఆలోచనా రంగంపై దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలన్న ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కలివేముల మనోహర్, మాజీ కౌన్సిలర్ రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రావు, రవి గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఆళ్ల వరప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి సురేష్ కురుమతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈనెల 30న సిరిసిల్లకు సీఎం రాక

## పకడ్బందీ ఏర్పాట్లకు కలెక్టర్ ఆదేశం

- ఈ నెల చివర్లో రేవంత్‌రెడ్డి పర్యటన.. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- రగుడు బైపాస్ సమీపంలో బహిరంగ సభకు ఏర్పాట్లు
- భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశం



**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 25(నేటి ప్రస్థానం):** ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు రానుండటంతో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడంతో పాటు బహిరంగ సభలో పాల్గొననున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. సీఎం పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలపై చర్చించి, శాఖల వారీగా చేపట్టాల్సిన పనులను సమీక్షించారు.

### బహిరంగ సభకు ఏర్పాట్లు

సిరిసిల్ల రగుడు బైపాస్ రోడ్డు సమీపంలోని మైదానంలో ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు కూడా సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

### భద్రతపై పోలీసుల ప్రత్యేక దృష్టి

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా భద్రతా చర్యలను పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, పర్యటన మొత్తం సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ తమకు అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్‌బాబు, వేములవాడ ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖితతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.




# విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవుకు రూ.40 వేల పరిహారం

**కారేపల్లి :** విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఆవు యజమానికి విద్యుత్ శాఖ తరఫున రూ.40 వేల పరిహారం అందజేశారు. సింగరేణి మండలం టేకుల గూడెం గ్రామపంచాయతీ పరిధిలో మే 4వ తేదీన విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. పరిహారం మంజూరు కావడంతో శుక్రవారం తిమ్మరావుపేట సబ్‌డివిజన్ కార్యాలయంలో టేకులగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ గుమ్మడి సందీప్ ఆధ్వర్యంలో వైరా డీఈ రమేష్ ఆవు యజమాని ముక్తి ప్రకాష్కు రూ.40 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుమ్మడి సందీప్ మాట్లాడుతూ.. ఆవు మృతి చెందిన విషయం తెలుసుకున్న వెంటనే పరిహారం కోసం విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.



# పల్లే ప్యారడైజ్ కాలనీలో వినాయక నిమజ్జనం

## రూ.3.23 లక్షలకు గణేశుని లడ్డూ వేలం

**కాప్రా :** కాలనీలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేశుని లడ్డూ వేలంపాట లో కాలనీవాసి బాకారం గోవర్ధన్ రెడ్డి రూ.3,23,000లకు లడ్డూను దక్కించు కున్నారు. వేలం అనంతరం కాలనీవాసులు హర్షధ్వానాల మధ్య గణేశుని లడ్డూను గోవర్ధన్ రెడ్డికి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాలనీవాసులు వినాయక విగ్రహంతో ఊరేగింపుగా వెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

## చిన్న కంజర్ల కౌన్సిలర్ మల్లేపల్లి శ్రీనివాస్

**పటన్ చెరు :** మండలం పరిధిలోని చిన్న కంజర్ల గ్రామంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడికి ఇంద్రేశం మున్సిపా లిటీ, చిన్న కంజర్ల 1వ వార్డు కౌన్సిలర్ మల్లెపల్లి శ్రీనివాస్ ఆయన కుటుంబ సభ్యులు, లావణ్య, అనన్య శ్రీ, అక్షిత్ సాయి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని విఘ్నేశ్వరుని వేడుకున్నారు. అ నంతరం కుటుంబ సభ్యులతో కలిసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు విఘ్నేశ్వరుని ఆశీస్సులతో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు అందరూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం విగ్నేశ్వరుని లడ్డు వేలం పాటలో గణనాథులు లడ్డు కూడా దక్కించుకున్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్, కమిటీ సభ్యులు, భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'సుప్రీం'లో పిటిషన్



**న్యూఢిల్లీ :** 'సర్' అంశంపై ఎన్నికల కమిషన్‌లో విభేదాలు ఏర్పడ్డాయంటూ వచ్చిన వార్తలపై రాజకీయ దుమారం తీవ్రమవుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు విపక్షాలు సిద్ధమవుతుండగా.. తాజాగా ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఆయనపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ కోరుతూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్ వేశారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా.. జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన మార్గదర్శకాలు, చేపట్టిన సాఫ్ట్‌వేర్ మార్పులన్నీ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. సర్‌కు సంబంధించిన నిర్ణయాలు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ.. 'ఫామ్-6'ను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. సర్ ప్రక్రియ సమయంలో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది పేర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయని, వాటిపై సిట్‌తో దర్యాప్తు జరిపేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ.. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీశ్ గార్గ్, ఈసీ ఐటీ హెడ్ సీమా ఖన్నాపై క్రిమినల్ విచారణ జరపాలని అభ్యర్థించారు.

### జెన్-జీ ఓటు హక్కును అడ్డుకుంటున్నారు: కాంగ్రెస్

మరోవైపు, ఈ వ్యవహారం నేపథ్యంలో సీఈసీపై కాంగ్రెస్ పార్టీ మరోసారి ఘాటు విమర్శలు చేసింది. జెన్-జీకి ఓటు హక్కు కల్పించకుండా ఆయన అడ్డుకుంటున్నారని ఆరోపించింది. "2024 నుంచి స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియను జ్ఞానేశ్ కుమార్ నిలిపివేశారు. ఈ ప్రక్రియతో 18ఏళ్లు నిండినవారు ఓటరు జాబితాలో చేరే అవకాశం ఉండేది. ఓవైపు, జెన్-జీకి ఓటు హక్కు లేకుండా చేస్తూ.. మరోవైపు ఓటు బాధ్యతలపై ఆయన యువతకు ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటు. ఇప్పుడు ఓటు చోరీ గురించి బయటపడిన తర్వాత సీఈసీ ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నారు" అని కాంగ్రెస్ విమర్శించింది.



# కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టండి

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడ్చల్ :** కాంగ్రెస్ పార్టీ బలోపేతం పై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చెప్పారు. మేడ్చల్ 299వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వజ్రేష్ యాదవ్ తో చర్చించారు. ఈ భేటీలో 299వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుంద భానుచందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సుధాకర్, పసల ఫిలిప్స్, ఎస్కే అక్బర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై నాయకులు చర్చించినట్లు తెలిపారు.

- 'నేడు' మీ ఆడబిడ్డ కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరవండి
- మీ కుమార్తె ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకోండి
- మీ ఆడబిడ్డ భవిష్యత్తుకు రూ. 70లక్షల భరోసా
- గొప్ప పెట్టుబడికి మార్గం సుకన్య సమృద్ధి యోజన

ఆడపిల్లల భవిష్యత్తు ఆర్థికంగా స్థిరంగా ఉండాలనే తల్లిదండ్రుల ఆశకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఒక అద్భుతమైన పథకమే సుకన్య సమృద్ధి యోజన. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2015 జనవరి 22న బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. మీ కుమార్తె ఉన్నత చదువుల కోసం లేదా వివాహ ఖర్చుల కోసం మీరు భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు. కేవలం తక్కువ మొత్తంతో పెట్టుబడి ప్రారంభించి, దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో డబ్బును కూడబెట్టుకోవచ్చు. అంతేకాకుండా ఈ పథకం ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని కూడా అందిస్తుంది. ఇది చాలా మంది పన్ను చెల్లింపుదారులకు అదనపు ఆకర్షణ.



# సుకన్య సమృద్ధి యోజన

### సుకన్య సమృద్ధి యోజన ప్రయోజనాలు :

- ఈ పథకం ద్వారా ఆడపిల్లల పుట్టిన తర్వాత నుంచే వారి భవిష్యత్తుకు ఆర్థిక పునాది వేయడానికి అవకాశం లభిస్తుంది
- ప్రభుత్వ హామీ, సురక్షితమైన పెట్టుబడి : ఈ పథకం కేంద్ర ప్రభుత్వంచే హామీ ఇవ్వబడిన పథకం. మీ పెట్టుబడికి పూర్తి భద్రత ఉంటుంది. ఎలాంటి రిస్క్ ఉండదు.
- దీర్ఘకాలిక ప్రయోజనం : ఈ పథకం దీర్ఘకాలికంగా ఆడపిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందించబడింది. 15 సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టి 21 సంవత్సరాల మెచ్యూరిటీ కాలం తర్వాత పెద్ద మొత్తాన్ని పొందవచ్చు. ఈ ప్రయోజనాలన్నీ కలిపి సుకన్య సమృద్ధి యోజనను ఆడపిల్లల భవిష్యత్తు కోసం ఒక అద్భుతమైన పెట్టుబడి అవకాశంగా మారుస్తున్నాయి. ఖాతా తెరిచే సమయానికి బాలిక వయస్సు 10 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ ఉండాలి. బాలిక 11 సంవత్సరాలు దాటితే ఈ పథకానికి అర్హులు కారు. ఒక కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరు బాలికల కోసం ఎస్ఎస్ వై ఖాతాను తెరవడానికి అనుమతి ఉంది.




### ఉదాహరణ :

**నెలకు రూ. 1,000 జమ చేస్తే :**

మీరు నెలకు రూ. 1,000 చొప్పున 15 సంవత్సరాలు (మొత్తం 180 నెలలు) జమ చేస్తే, మీ మొత్తం పెట్టుబడి రూ. 1,80,000 అవుతుంది. 21 సంవత్సరాల మెచ్యూరిటీ సమయంలో, అంచనా వడ్డీ (ప్రస్తుత వడ్డీ రేటు 2 శాతం ఆధారంగా) సుమారు రూ. 3,74,612 అవుతుంది. అంటే, మీకు మొత్తం రూ. 5,54,612 చేతికి వస్తాయి.

**సంవత్సరానికి రూ.1,50,000 జమ చేస్తే :**

మీరు ప్రతి సంవత్సరం గరిష్టంగా రూ. 1,50,000 చొప్పున 15 సంవత్సరాలు జమ చేస్తే మీమొత్తం పెట్టుబడి రూ. 22,50,000 అవుతుంది. 21 సంవత్సరాల మెచ్యూరిటీ సమయంలో ప్రస్తుత వడ్డీ రేట్ల ప్రకారం మీకు అంచనాగా రూ. 71 లక్షలకు పైగా మొత్తం చేతికి వచ్చే అవకాశం ఉంది. ఈ పథకం తల్లిదండ్రులకు ఎంతో ప్రశాంతతను అందిస్తుంది. మీరు ఇంకా మీ ఆడబిడ్డ కోసం సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరవకపోతే నేడే సమీపంలోని బ్యాంక్ లేదా పోస్టాఫీసును సందర్శించి, మీ కుమార్తె ఉజ్వల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయండి.

# రియల్ లైఫ్ వదిలి రీల్ లైఫ్‌కి బానిసలుగా నేటి యువత!

- వాస్తవ ప్రపంచాన్ని మరిచి వర్చువల్ ప్రపంచంలో జీవిస్తున్న నేటి తరం
- యువతలో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న డిజిటల్ వ్యసనం

సాంకేతికత మనిషి జీవితాన్ని మెరుగుపరిచిన గొప్ప సాధనం అనడంలో సందేహం లేదు. కానీ, నేడు అదే టెక్నాలజీ, ముఖ్యంగా 'డిజిటల్ మత్తు' రూపంలో యువతకు ఒక నిశ్శబ్ద మహమ్మారిగా మారుతోంది. ఇది చదువు, కెరీర్, మానవ సంబంధాలు, మానసిక ఆరోగ్యం.. ఇలా ప్రతి రంగాన్ని మెల్లగా కుదిపేస్తోంది. వాస్తవ ప్రపంచాన్ని వదిలి వర్చువల్ ప్రపంచంలో జీవించడానికి అలవాటు పడుతున్న నేటి తరం, టెక్నాలజీకి బానిసలుగా మారి తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు.




### సోషల్ మీడియా: వినోదం నుంచి వ్యసనం వైపు పయనం

- స్నేహితులతో మాట్లాడేందుకు, ప్రపంచ విశేషాలు తెలుసుకునేందుకు ఉపయోగపడిన సోషల్ మీడియా ఇప్పుడు యువత సమయాన్ని మింగేస్తున్న లిడిజిటల్ అగాధం' రూపాంతరం చెందింది.
- లైక్స్, కామెంట్లు, ఫాలోవర్స్ కోసం పరితపించడం నేటి యువత ఆత్మవిశ్వాసాన్ని, విలువలను నిర్ణయించే ప్రమాణాలైపోయాయి.
- తెర వెనుక ఉన్న ఈ అబద్ధపు ప్రపంచం, దాని ప్రభావాలు మాత్రం అసలు జీవితాన్నే దెబ్బతీస్తున్నాయి.

### గణాంకాలు చెబుతున్న కఠోర వాస్తవాలు

- భారతదేశంలో డిజిటల్ వ్యసనం వేగంగా పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.
- 72% భారతీయ యువత రోజుకు 4 గంటలకు పైగా సోషల్ మీడియాలో గడుపుతున్నారు.
- 35% మంది విద్యార్థులు తమ నిద్రను తగ్గించుకుని, రాత్రిళ్లు రీల్స్, షార్ట్స్ చూస్తున్నారు.
- కేవలం మూడు ఏళ్లలోనే, 13%–%25 ఏళ్ల వయసు వారిలో డిజిటల్ వ్యసనం 40% పెరిగింది.
- డిప్రెషన్ కేసులు 60% మరియు ఆందోళన కేసులు 45% పెరిగాయని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి.
- ఈ సంఖ్యలు కేవలం లెక్కలు కావు... వచ్చే తరంపై వేలాడుతున్న ప్రమాద ఘంటికలు.

### మొబైల్ స్క్రీన్‌లో బందీ అవుతున్న అనుబంధాలు

ఈ రోజుల్లో ఇంట్లో ఒక టేబుల్ చుట్టూ నలుగురు కూర్చుంటారు, కానీ మాట్లాడుకునేది మాత్రం నాలుగు మొబైల్ స్క్రీన్లు.

- తల్లిదండ్రులతో మాట్లాడడానికి సమయం లేదు గానీ, తెలియని వ్యక్తుల వీడియోలకు లైక్‌లు కొట్టి, కామెంట్లు పెట్టడానికి సమయం ఉంటుంది.
- కుటుంబంలో 'క్వాలిటీ టైమ్' అనే పదం గతం అయిపోతోంది. ఇంట్లో నవ్వులు, మాటలు తగ్గిపోగా, నోటిఫికేషన్ సౌండ్‌లే కొత్త సంభాషణగా మారిపోయాయి.
- స్క్రీన్ వెలుగు పెరిగినంతగా, సంబంధాల వెలుగు తగ్గిపోతోంది. ఇది వ్యక్తిగత వికాసానికి, భావోద్వేగ స్థిరత్వానికి అతి పెద్ద అవరోధంగా మారుతోంది.

### పోలికల మానసిక గాయం: యువతలో కొత్త సమస్య

సోషల్ మీడియా చూపించే 'పర్ఫెక్ట్', ఫిల్టర్ చేసిన జీవితాలను చూసి, "వాళ్ల జీవితం అంత అందంగా ఉంటే, నాది ఎందుకు ఇలా ఉంది?" అనే ఆలోచన యువతను లోలోపల నుండి కుంగదీస్తోంది. తమతో ఇతరులను పోల్చుకునే ఈ 'పోలికల మానసిక గాయం' నేటి యువతలో



ఒత్తిడి, డిప్రెషన్, నిరుత్సాహానికి ప్రధాన కారణంగా మారుతోంది.

### స్మార్ట్‌ఫోన్ విషాదం: ఒక విద్యార్థి ఆత్మహత్య కథ

- హైదరాబాద్‌లో నివసించే ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన 15 ఏళ్ల టాపర్ పిల్లాడి కల డాక్టర్ కావాలని. పదో తరగతి తర్వాత కొడుకు కోరిక మేరకు తండ్రి స్మార్ట్‌ఫోన్ కొనిచ్చాడు. అక్కడే ఆ కుటుంబం కథ అడ్డం తిరిగింది. రాత్రి, పగలు తేడా లేకుండా ఫోన్‌లోనే మునిగిపోయిన ఆ పిల్లవాడు, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్స్ లైఫ్‌స్టైల్‌కు ప్రభావితమయ్యాడు. రెండేళ్లలో ఇంటర్‌లో ఫెయిల్ అవ్వడమే కాకుండా, సైబర్ ఇబ్బందులు ఎదుర్కొని డిప్రెషన్‌కు గురై ఆత్మహత్య చేసుకున్నాడు.
- ఇదంతా ఎందుకు జరిగిందని ఆలోచించారా? ఇలాంటి ఘటనలు మన చుట్టూ జరగకుండా ఉండాలంటే, తల్లిదండ్రులు, సమాజం కలిసికట్టుగా మేల్కోవాలి.

### పరిష్కారం: నియంత్రణతోనే నిజమైన విజయం

టెక్నాలజీని దూరం చేసుకోవడం కాదుబీ దాన్ని నియంత్రించడం నేర్చుకోవాలి. ఈ ప్రమాదకర ధోరణిని అడ్డుకోవాలంటే, యువత, తల్లిదండ్రులు, సమాజం కలిసికట్టుగా కృషి చేయాలి.

### యువత తీసుకోవాల్సిన చర్యలు:

- పరిమితి పాటించండి: రోజుకు 1%–%2 గంటలకు మించి సోషల్ మీడియా వాడకాన్ని నియంత్రించుకోవాలి.
- డిజిటల్ డిటాక్స్: వారానికి ఒకరోజు 'డిజిటల్ డిటాక్స్ డే' (ఫోన్ లేకుండా గడపడం) పాటించాలి.
- నియమం: నిద్రకు కనీసం 1 గంట ముందు లి'నో ఫోన్ జోన్'లిను అమలు చేయాలి.
- వాస్తవ ప్రపంచం: ప్రతిరోజు 30 నిమిషాలు వాస్తవ ప్రపంచ యాక్టివిటీలకు (క్రీడలు, పుస్తకాలు చదవడం, ఇతరులతో సంభాషణ) కేటాయించాలి.

### తల్లిదండ్రుల పాత్ర కీలకం :

- టెక్–ఫ్రీ ఫ్యామిలీ టైమ్: ఇంట్లో ప్రతిరోజూ ఒక నిర్దిష్ట సమయాన్ని టెక్నాలజీ లేకుండా కేటాయించాలి.
- సంభాషణ: పిల్లల భావోద్వేగాలను తెలుసుకుంటూ క్రమం తప్పకుండా మాట్లాడాలి.
- హాబీలు ప్రోత్సహించండి: స్పోర్ట్స్, మ్యూజిక్, డాన్స్, పెయింటింగ్ లాంటి హాబీలను ప్రోత్సహించడం ద్వారా వారి దృష్టిని డిజిటల్ స్క్రీన్ల నుంచి మరల్చాలి.
- అవగాహన: సోషల్ మీడియా వ్యసనం వల్ల వచ్చే మానసిక, శారీరక సమస్యలను సహనంతో వివరించాలి.

### సమాజం -విద్యాసంస్థల బాధ్యత:

- మానసిక ఆరోగ్య విద్య: పాఠశాలల్లో మానసిక ఆరోగ్యంపై విద్యను, డిజిటల్ వ్యసనం ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను తప్పనిసరి చేయాలి.
- గుర్తుంచుకోండి: రీల్ ప్రపంచం ఆకర్షణీయమే కానీ రియల్ ప్రపంచమే జీవితం. టెక్నాలజీని మనం ఉపయోగించుకోవాలి కానీ మనమే దాని చేతిలో బందీలవ్వకూడదు.
- జీవితం అంటే ఫిల్టర్లలో కనిపించే అందం కాదు, కళ్లతో చూసి, మనసుతో అనుభూతి చెందేదే నిజమైన జీవితం. వర్చువల్ ప్రపంచం నుంచి బయటపడి, మీ విలువైన జీవితాన్ని మీ చేతుల్లోకి తీసుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరు.

– జి.అజయ్ కుమార్

కడుపు ఉబ్బరం అనేది అత్యంత సాధారణ జీర్ణ సమస్యల్లో ఒకటి. భారీగా తిన్న తర్వాత, వేడి వాతావరణంలో లేదా ఒత్తిడి కారణంగా ఇది ఎప్పుడైనా వచ్చే అవకాశాలు ఉంటాయి. కడుపు నిండిన భావన, గట్టిగా అనిపించడం లేదా గ్యాస్ ఉండటం వలన రోజంతా అసౌకర్యంగా, అలసటగా అనిపిస్తుంది. సాధారణంగా ఇది పెద్ద సమస్య కాకపోయినా, రోజువారీ జీవనశైలిని ప్రభావితం చేస్తుంది. అయితే సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఈ సమస్యను సులభంగా నియంత్రించవచ్చు. ముఖ్యంగా కొన్ని పండ్లు, వాటిలో ఉన్న నీటి శాతం, ఫైబర్, జీర్ణ ఎంజైమ్స్ బ్లోటింగ్‌ను సహజంగా తగ్గించడంలో సహాయపడతాయి. బ్లోటింగ్‌ను తగ్గించే పండ్ల గురించి వైద్యులు వివరిస్తున్నారు.

## పైనాపిల్, అరటి పండ్లు..

పైనాపిల్ పండు జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది ప్రోటీన్లను విభజించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా భారీగా లేదా ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకున్న తర్వాత ఇది జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. అలాగే జీర్ణనాళంలో వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. భోజనం తర్వాత కొద్దిగా తాజా అనాస ముక్కలు తింటే కడుపు ఉబ్బరం తగ్గుతుంది. అలాగే అరటిపండు పొట్టకు మృదువుగా ఉండే పండు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది, ఇది శరీరంలోని సోడియం స్థాయిలను సమతుల్యం చేస్తుంది. సోడియం ఎక్కువైతే నీరు నిల్వ అవడం వల్ల బ్లోటింగ్ పెరుగుతుంది. అరటిపండు ద్రవ సమతుల్యతను నియంత్రించి కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. అలాగే ఇది సులభంగా జీర్ణమవుతుంది.



# కడుపు ఉబ్బరం సమస్యకు చెక్ పెట్టండిలా!

## ఈ సూచనలు కూడా పాటించాలి..

పండ్లు బ్లోటింగ్‌ను తగ్గించడంలో అనేక విధాలుగా సహాయపడతాయి. వీటిలోని నీరు శరీరంలో అదనపు సోడియంను బయటకు పంపిస్తుంది. ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచి మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. సహజ ఎంజైమ్స్ ఆహారం త్వరగా జీర్ణం కావడంలో సహాయపడతాయి. ఇవన్నీ కలిసి గ్యాస్ ఏర్పడే అవకాశాన్ని తగ్గిస్తాయి. ఈ పండ్లు ఉపయోగపడినా, రోజువారీ అలవాట్లు కూడా చాలా ముఖ్యం. వేగంగా తినడం, ఎక్కువగా తినడం లేదా ప్రాసెస్డ్ ఆహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల బ్లోటింగ్ పెరుగుతుంది. జీర్ణక్రియ సరిగ్గా ఉండాలంటే ఆహారాన్ని నెమ్మదిగా నమిలి తినాలి. రోజంతా తగినంత నీరు తాగాలి. ఉప్పు, ప్రాసెస్డ్ ఫుడ్స్ తగ్గించాలి. ఫైబర్ సమతుల్యంగా తీసుకోవాలి. అప్పుడప్పుడు బ్లోటింగ్ రావడం సాధారణమే. అయితే ఇది తరచూ లేదా తీవ్రంగా ఉంటే, ఇర్రిటేబుల్ బావెల్ సిండ్రోమ్ లేదా ఆహారం పడకపోవడానికి సంకేతంగా నిలుస్తుంది. తీవ్రమైన నొప్పి, బరువు తగ్గడం లేదా మలవిసర్జనలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే తప్పకుండా వైద్యుడిని సంప్రదించాలి. బ్లోటింగ్ అసౌకర్యాన్ని కలిగించినా సరైన ఆహార ఎంపికలతో దీన్ని సులభంగా నియంత్రించవచ్చు. పైనాపిల్, అరటి, కివి వంటి పండ్లు జీర్ణక్రియను మెరుగుపరచి సహజంగా ఉపశమనాన్ని ఇస్తాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చడం ద్వారా తేలికగా, ఉత్సాహంగా రోజును గడపవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.



## పుచ్చకాయ, ఆపిల్ పండ్లు..

పుచ్చకాయలో నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. సరైన హైడ్రేషన్ జీర్ణక్రియకు చాలా అవసరం. ఇది సహజ మూత్రవిసర్జనను పెంచి అదనపు లవణాలను బయటకు పంపిస్తుంది. ముఖ్యంగా వేసవిలో బ్లోటింగ్‌ను తగ్గించడంలో పుచ్చకాయ ఉపయోగపడుతుంది. అదే విధంగా ఆపిల్ పండులో పెక్టిన్ అనే ద్రావణీయ ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. మలబద్ధకం బ్లోటింగ్‌కు ప్రధాన కారణం. అయితే ఆపిల్‌ను పరిమితంగా తినడం మంచిది, ఎందుకంటే ఎక్కువ ఫైబర్ తీసుకుంటే కొందరిలో గ్యాస్ సమస్య పెరుగుతుంది. కివి చిన్న పండు అయినా జీర్ణక్రియకు చాలా ఉపయోగకరం. ఇందులో యాక్టినిడిన్ అనే ఎంజైమ్ ఉంటుంది, ఇది ప్రోటీన్లను విభజించడంలో సహాయపడుతుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచి గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రోజుకు ఒకటి లేదా రెండు కివి పండ్లు తింటే జీర్ణక్రియ సవ్యంగా ఉంటుంది. నారింజ పండు నీరు, ఫైబర్ సమృద్ధిగా కలిగి ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని నివారించి గట్ (జీర్ణ వ్యవస్థ) ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇందులోని విటమిన్ సి కూడా జీర్ణక్రియకు మేలు చేస్తుంది. ఈ పండ్లను ఆహారంలో చేర్చడం ద్వారా బ్లోటింగ్ తగ్గుతుంది.



# దిప్యారడైజ్.. ఫస్ట్‌డే కలెక్షన్స్ రూ.88 కోట్లు

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లను నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లు వసూళ్లు చేసినట్లు చెప్పింది. నాని కెరీర్‌లోనే ఇవి రికార్డు స్థాయి కలెక్షన్స్ అని వెల్లడించింది. మరోవైపు 'ది ప్యారడైజ్' విడుదల సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ నాని ధన్యవాదాలు తెలిపారు. చిరంజీవి తన ప్రపంచమన్న నాని.. ఆయన నుంచి విషెస్ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక విజయ్ దేవరకొండకు రిప్లై ఇస్తూ.. రణబాలి గురించి ప్రస్తావించారు. అక్టోబర్ 16 బ్లాక్‌బస్టర్ కొట్టాలి అని అన్నారు. రష్మికకు ఇది మర్చిపోలేని దసరా కావాలన్నారు. ఆది సాయికుమార్, నితిన్‌లకు నాని థాంక్స్ చెప్పారు.



## 'ది ప్యారడైజ్' రివ్యూలపై స్పందించిన నాని

'ది ప్యారడైజ్' సినిమాపై చూపిస్తున్న ప్రేమ, విమర్శలు రెండింటినీ స్వాగతిస్తున్నానని అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు కీలక పాత్ర పోషించారు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రానికి సంబంధించిన రివ్యూలు, ప్రేక్షకుల అభిప్రాయాలు సామాజిక మాధ్యమాల వేదికగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నాని స్పందించారు. ఈ మేరకు ఎక్స్‌వేదికగా పోస్ట్ పెట్టారు. "ది ప్యారడైజ్'పై మీ అభిప్రాయాలు, స్పందన అన్నింటినీ చూశా. మీరు చూపించిన ప్రేమతో పాటు, సరదా ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా. దీనిని తమ సినిమాగా ప్రేక్షకులు స్వీకరించిన తీరు నా హృదయానికి హత్తుకుంది. అదే సమయంలో సినీ విమర్శకులు, రివ్యూవర్లు ఎత్తి చూపిన పొరపాట్లు, లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరికీ కృతజ్ఞతలు. మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో రక్తం, చెమట చిందించి తీర్చిదిద్దాం. మీరు దీన్ని సంబరంగా చేసుకోవచ్చు. విమర్శించవచ్చు. సినిమాపై మీరు చూపించిన ఉత్సాహం, నాపై కురిపించిన ప్రేమ, ఆప్యాయత నాలో కృతజ్ఞత భావాన్ని నింపాయి" అని ఎక్స్ వేదికగా నాని పోస్ట్ పెట్టారు. భారీ అంచనాల మధ్య విడుదలైన 'ది ప్యారడైజ్' తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లు వసూళ్లు చేసినట్లు చిత్ర బృందం చెప్పింది. నాని కెరీర్‌లోనే ఇవి రికార్డు స్థాయి కలెక్షన్స్ అని వెల్లడించింది.




## ఓటీటీలోకి 'రంభ ఊర్వశి మేనక'

అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో నటించిన కామెడీ ఎంటర్‌టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. ఇటీవల విడులైన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సురభి, వెన్నెల కిషోర్, రాశిసింగ్, విష్ణుప్రియ, ప్రిషాసింగ్ కీలకపాత్రల్లో నటించారు.

మంతెన సూర్యనారాయణ అలియాస్ సూరి (అల్లరి నరేశ్) కుటుంబం తరాలుగా రంభ ఊర్వశి మేనక డ్రామా కంపెనీని నిర్వహిస్తుంటుంది. వారి దగ్గర ఓ మేజిక్ బుక్ ఉంటుంది. ఆ బుక్‌పై సరిగ్గా ముగ్గు వేస్తే పైనుంచి రంభ ఊర్వశి మేనక దిగి వచ్చి కోరికలన్నీ తీర్చేస్తారని ఓ నమ్మకం. ఆ బుక్‌నే నమ్ముకున్న కుటుంబం అప్పుల ఊబిలోకి వెళ్లిపోతుంది తప్ప రంభ ఊర్వశి మేనక మాత్రం దిగిరారు. సూరి కూడా అంతే. చిన్నప్పట్నుంచీ హీరో కావాలనేది అతని కల. కానీ, అందుకు తగ్గ ప్రయత్నాలేవీ చేయకుండా, మేజిక్ బుక్ పేరు చెప్పి అందరి దగ్గరా అప్పులు చేస్తుంటాడు. అలా ఊరి నిండా అప్పులు పెరిగిపోయి కష్టాలు చుట్టు ముడతాయి తప్ప ఆ బుక్ తెరుచుకోదు, ఇంతలో సూరి తల్లి మంచం పడుతుంది. అనూహ్యంగా ఆ బుక్ తెరుచుకుని పైనుంచి రంభ ఊర్వశి మేనక దిగొస్తారు. మరి వాళ్లు సూరి కోరికల్ని తీర్చారా? లేదా అనేది కథ.

## అందుకే యాక్షన్ కథలంటే ఆసక్తి

"ఒక సినిమాతో అన్ని రకాల భావోద్వేగాలు ప్రదర్శించే అవకాశం చాలా తక్కువసార్లు వస్తుంటుంది. అలాంటి ఓ అరుదైన పాత్ర 'సిగ్మా'తో నాకు దక్కింది" అన్నారు ఫరియా అబ్దుల్లా. ఆమె కథానాయికగా నటించిన చిత్రమే 'సిగ్మా'. సందీప్‌కిషన్ కథానాయకుడు. జాసన్ సంజయ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఫరియా మాట్లాడుతూ "ఇందులో నేను రేడియో జాకీ సామ్‌గా కనిపిస్తా. చాలా మంచి పాత్ర. తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు, దర్శకుడు జాసన్‌కి దర్శకత్వంపై మంచి పట్టుంది. తమిళ ప్రేక్షకులు ఆయనపైనా, సందీప్‌కిషన్‌పైనా ఎంతో ప్రేమని కురిపిస్తుంటారు. ఆ ప్రేమ నాకూ కలిసొచ్చింది. ఆహారపు అలవాట్లు తప్ప తెలుగు, తమిళ పరిశ్రమల మధ్య నాకు వ్యత్యాసమేమీ కనిపించలేదు. నాకు అన్ని రకాల కథలూ చేయాలని ఉంటుంది. కాకపోతే నా వ్యక్తిత్వానికి యాక్షన్ బాగా నప్పుతుంది. అందుకే యాక్షన్ ప్రధానమైన కథల్లో నటించడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతుంటా. నేనే కొన్ని కథల్నీ రాసుకుంటున్నా. దర్శకత్వంపై ఆసక్తి ఉంది. నేను దర్శకత్వం వహించే సినిమాలో నేనూ తప్పకుండా నటిస్తా" అని చెప్పారు.





## పిల్లలను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటా..

### మాతృత్వంపై రష్మిక ఆసక్తికర వ్యాఖ్యలు

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక వివాహ బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మాతృత్వం గురించి గతంలో రష్మిక చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు నెట్టింట మరోసారి వైరల్‌గా మారాయి. పెళ్లికి ముందు ఓ ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్, పిల్లల పెంపకంపై స్పష్టమైన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేనింకా తల్లిని కాకపోయినా.. భవిష్యత్తులో పుట్టబోయే నా పిల్లలంటే అప్పుడే నాకు బలమైన భావోద్వేగం ఏర్పడింది. వాళ్లను ఎంతో సురక్షితంగా చూసుకోవాలనుకుంటున్నా. నా పిల్లల కోసం నేను దేనికైనా సిద్ధమే. అవసరమైతే వారి కోసం యుద్ధం చేయడానికైనా నేను వెనకాడను. అందుకు తగ్గట్లుగా శారీరకంగా నన్ను నేను ఎప్పుడూ ఫిట్‌గా ఉంచుకుంటా" అని రష్మిక పేర్కొన్నారు. కెరీర్, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడంపైనా రష్మిక తన ఆలోచనలను పంచుకున్నారు. "20, 30 ఏళ్ల వయసులో కెరీర్‌పై పూర్తి దృష్టి పెట్టి ఆర్థికంగా స్థిరపడాలి. ఆ తర్వాతి దశలో వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవాలి. మహిళలకు కూడా సొంత సంపాదన, ఆర్థిక స్వేచ్ఛ ఉండడం చాలా ముఖ్యం" అని ఆమె చెప్పారు. ఇక, వివాహం తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక తొలిసారిగా 'రణబాలి' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దసరా కానుకగా ఈ చిత్రం అక్టోబరు 16న థియేటర్లలో విడుదల కానుంది.




## 'రామాయణ' జయ జయ రామ్ తెలుగు వీడియో సాంగ్ రిలీజ్..

నితేశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రం నుంచి 'జయ జయ రామ్' అనే పాట హిందీ వెర్షన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం తెలుగు ఆడియో ఉన్న పాటను చిత్ర బృందం విడుదల చేసింది. రాముడిగా రణ్‌వీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఆకట్టుకుంటున్నారు. రాకేందు మౌళి లిరిక్స్ అందించగా.. ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ స్వరపరిచారు. దీపాలి, రాఘవ్ కౌశిక్ ఆలపించారు.

## విదేశాలకు వెళ్లే వారికి వొడాఫోన్ ఐడియా గుడ్‌న్యూస్

### ఇంటర్నేషనల్ రోమింగ్ ఫ్రీ




ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా కొత్త ఆఫర్‌తో ముందుకొచ్చింది. తమ చందాదారులకు ఇంటర్నేషనల్ రోమింగ్‌ను ఉచితంగా అందిస్తోంది. ఎంపిక చేసిన పోస్ట్ పెయిడ్, ప్రీపెయిడ్, ఎంటర్‌ప్రైజ్ ప్లాన్లతో ఈ సదుపాయం ఉచితంగా ఇస్తోంది. ప్రత్యేకంగా ఎలాంటి రోమింగ్ ఛార్జీలూ చెల్లించకుండా 170కి పైగా దేశాల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఏడాదికి మూడు ట్రిప్పుల వరకు ఈ అవకాశం కల్పిస్తోంది. తద్వారా రూ.9 వేల వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపింది. సాధారణంగా విదేశాలకు వెళ్లే ప్రయాణికులు పాత సిమ్ తీసేసి, స్థానిక సిమ్ వినియోగిస్తుంటారు. లేదంటే ఇన్‌కమింగ్ కాల్స్, ఓటీపీలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు వేరుగా ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌తో రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియా యూజర్లు మాత్రం కాల్స్, ఓటీపీల కోసం తమ నంబర్‌నే యథాతథంగా కొనసాగించొచ్చు. రూ.501 పైబడిన పోస్ట్ పెయిడ్ ప్లాన్లు, వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్ యూజర్లు, రూ.451తో ప్రారంభమయ్యే ఎంటర్‌ప్రైజెస్ ప్లాన్ కలిగిన వినియోగదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. వీఐ యాప్ ద్వారా రోమింగ్ ఫ్రీ ప్లాన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చని చెప్పింది. ప్యాకేజీని బట్టి ఇంటర్నేషనల్ డేటా, ఔట్ గోయింగ్ కాలింగ్ ప్రయోజనాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది.



# బిజినెస్




## లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకున్నాయి. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ 315 పాయింట్లు, నిఫ్టీ 77 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 73,525.92 (క్రితం ముగింపు 73,580.54) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. తర్వాత రాణించింది. ఈ క్రమంలోనే 315.20 పాయింట్ల లాభంతో 73,895.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 77.40 పాయింట్ల లాభంతో 23,140.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.80గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ట్రెంట్, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ, టాటా స్టీల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 105 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4305 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## పోల్ వాల్ట్‌లో భారత్‌కు కాంస్యం..

ఆసియా గేమ్స్- 2026లో భారత మహిళా అథ్లెట్ భరణికా ఇళంగోవన్ చరిత్ర సృష్టించింది. పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 4.15 మీటర్ల ఎత్తు ఎగిరి కాంస్య పతకం సాధించింది. ఇప్పటివరకు నిర్వహించిన ఆసియా గేమ్స్‌లో ఈ ఈవెంట్‌లో భారత్‌కు పతకం రావడం ఇదే ప్రథమం. ఈ పోటీల్లో కజకిస్థాన్‌కు చెందిన పోలినా నివానోవా కూడా 4.15 మీటర్లు ఎగిరి మూడో స్థానంలో నిలిచింది. దీంతో కాంస్య పతకాన్ని ఇద్దరూ పంచుకున్నారు. జపాన్‌కు చెందిన మిసాకి మరోటా 4.55 మీటర్లు క్లియర్ చేసి పసిడి పతకం సొంతం చేసుకోగా.. చైనాకు అథ్లెట్ చుంగే నియూ 4.50 మీటర్లతో రజతం సాధించింది. 1997 ఫిబ్రవరి 3న తమిళనాడులోని మయిలాడుతురైలో జన్మించిన భరణిక.. ఈ స్థాయికి చేరుకునేందుకు ఎన్నో కష్టనష్టాలకోర్చింది. 2020లో మోకాలి గాయంతో సుదీర్ఘకాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2023లో భువనేశ్వర్‌లోని రిలయన్స్ ఫౌండేషన్ హై పెర్ఫామెన్స్ సెంటర్‌కు వెళ్లింది. అక్కడ కోలుకునేందుకు అనువైన పరిస్థితులతోపాటు మెరుగైన శిక్షణ అందడంతో జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమైంది. మార్చి నెలలో బెంగళూరులో జరిగిన ఇండియన్ ఓపెన్ జంప్ కాంపిటిషన్‌లో 4.10మీటర్ల ఎత్తును క్లియర్ చేసి.. ఆసియా క్రీడలకు అర్హత సాధించింది. భారత్‌కు బంగారు పతక ఆశలు రేకెత్తించింది. అంతేకాకుండా 65వ నేషనల్ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 4.20 మీటర్ల ఎత్తు ఎగిరి విజేతగా నిలిచింది.

**10వేల మీటర్ల పరుగులో గుల్‌వీర్‌కు రజతం :** మరోవైపు, లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ విభాగంలో గుల్‌వీర్ సింగ్ రజతం సాధించాడు. పురుషుల 10000 మీటర్ల దూరాన్ని 28 నిమిషాల 29 సెకన్ల 38 మిల్లీ సెకన్లలో పూర్తి చేసి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. 1500 మీటర్లు, 5000 మీటర్ల విభాగంలోనూ గుల్‌వీర్ సింగ్ పోటీ పడనున్నాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో (రాష్ట్రశీశేఅఅస్త్ర) భారత షూటర్లు కమల్‌జీత్, సు-రుచి సింగ్ స్వర్ణం (+శీశ్రీఃఎ వీవఋశ్రీ) సాధించిన సంగతి తెలిసిందే. తాజా ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటివరకు 23 పతకాలు సాధించింది. వీటిలో 2 స్వర్ణం కాగా, 9 రజతం, 12 కాంస్య పతకాలున్నాయి.




## భారత్‌కు రెండో గోల్డ్ మెడల్

ఆసియా క్రీడల షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశపర్చినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో మన దేశానికి రెండో పసిడి పతకం లభించింది. అంతకుముందు మహిళల క్రికెట్ జట్టు బంగారు పతకం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. ఇక, దక్షిణకొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి. ఇక, పురుషుల 50 మీటర్ల రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత త్రయం రజతం సాధించింది. ఫైనల్‌లో మన షూటర్లు ఐశ్వరీ ప్రతాత్ సింగ్ తోమర్, రుద్రాంశ్ పాటిల్, నీరజ్ కుమార్ మొత్తంగా 1762 పాయింట్లు సాధించారు. 1766 పాయింట్లతో చైనా టీమ్ స్వర్ణం నెగ్గింది. కేవలం నాలుగు పాయింట్ల తేడాతో మన జట్టుకు త్రుటిలో పసిడి చేజారింది. మరోవైపు స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో జోష్న చిన్నప్ప, సెంథిల్ కుమార్ పతకం ఖాయం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో ఫిలిప్పీన్స్ జోడీ డేవిడ్ పెలినో-జెమైకా అరిబాడోను 11-3, 11-5తో ఓడించి మన ఆటగాళ్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. దీంతో కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. అటు టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో భారత ద్వయం మనుష్ షా, దియా చితాలే కూడా పతకం ఖాయం చేసుకున్నారు. క్వార్టర్స్‌లో వీరు హాంకాంగ్ జోడీని 11-6, 13-15, 11-9, 11-5తో ఓడించారు.

## ఐసీసీ ట్రోఫీలు సొంతం కావాలంటే..

# భారత్‌పై గెలవాలి

### డారెన్ సామీ



మూడు వన్డేలు, ఐదు టీ20లను ఆడేందుకు భారత పర్యటనకు వెస్టిండీస్ వచ్చింది. ఆదివారం నుంచి వన్డే సిరీస్ మొదలు కానుంది. ఇక్కడ టీమ్‌ఇండియాపై దాదాపు 24 ఏళ్ల నుంచి విండీస్ జట్టు సిరీస్‌ను గెలవలేదు. ఐసీసీ కప్పులను తమ జట్టు గెలవాలంటే.. కచ్చితంగా భారత్‌లాంటి బలమైన టీమ్‌ను అడ్డుకోవాల్సి ఉందని వెస్టిండీస్ కోచ్ డారెన్ సామీ అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌ను తాము వరల్డ్ కప్ అర్హతకు సన్నాహకంగా మార్చుకుంటామని వెల్లడించాడు. "గత 24 ఏళ్లుగా మాకు భారత్ వేదికగా సిరీస్ దక్కలేదు. ఈసారి గెలిచేందుకు మంచి అవకాశం. మమ్మల్ని మేం సవాల్ చేసుకొని అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాం. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఐసీసీ ఈవెంట్లలో గెలవాలంటే.. ముందు భారత్ వంటి పెద్ద జట్లను అడ్డుకొనేలా ఆటతీరు ఉండాలి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో క్వాలిఫయర్స్ ఉంటాయి. దక్షిణాఫ్రికా వేదికగా జరగబోయే వరల్డ్ కప్‌లో మేం ఆడేందుకు అర్హత సాధిస్తామనే నమ్మకం ఉంది. ఇప్పుడీ సిరీస్‌ను అందుకు సన్నాహకంగా భావిస్తాం" అని సామీ తెలిపాడు. "ప్రస్తుతం మేం బరిలోకి దిగే జట్టులో నాణ్యమైన ప్లేయర్లే ఉన్నారు. ఒకరిద్దరిపైనే మేం ఆధారపడం. మా స్థాయికి తగ్గట్టు ఆడితే ఈపాటికే మేం నేరుగా వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించే వాళ్లం. కానీ, ఆరు పాయింట్ల తేడాతో మిస్ చేసుకున్నాం. ఇప్పుడు వన్డే క్రికెట్‌లో మెరుగైన పురోగతి సాధించాం. ఇప్పుడు భారత్‌తో సిరీస్‌లో ప్రతి ఒక్కరికీ అవకాశం ఇవ్వడానికి ప్రయత్నిస్తాం. 19 ఏళ్ల కుర్రాడు విటెల్‌లో అద్భుతమైన టాలెంట్ ఉంది. మాకు మోతీ రూపంలో ఓ అద్భుతమైన రిస్ట్ స్పిన్నర్ ఉన్నాడు. గత కొన్నేళ్లుగా అతడి గురించి వినే ఉంటారు. ఇప్పుడు విటెల్ కూడా ఆరంభంలో జట్టు విజయాల్లో ప్రభావం చూపించడం అభినందనీయం. జట్టుగా మేం చేయాల్సింది చాలా ఉంది. అతడికి మద్దతుగా నిలుస్తాం" అని సామీ పేర్కొన్నాడు.

# దంచేసిన కోహ్లి, రోహిత్..



వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ నేపథ్యంలో ఆదివారం తిరువనంతపురం వేదికగా టీమిండియా తొలి వన్డే ఆడనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రాక్టీస్ ఆరంభించిన భారత జట్టు శుక్రవారం రెండు జట్లుగా విడిపోయి ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడాయి. ఇండియా-ఏ జట్టులో గిల్, కోహ్లి, జడేజా, రుతురాజ్, కేఎల్ రాహుల్ బ్యాటింగ్ చేయగా, ఇండియా-బి జట్టులో రోహిత్ శర్మ, జైస్వాల్, ధ్రువ్ జురెల్, నితీశ్‌కుమార్ రెడ్డి, నమన్ ధీర్‌లు బ్యాటింగ్ చేశారు. ఇరుజట్లు 50 ఓవర్ల మ్యాచ్ ఆడాయి. ఈ మ్యాచ్‌లో ఇండియా-ఏ జట్టు విజయం సాధించింది. సీనియర్లు కోహ్లి, రోహిత్‌లు బ్యాటింగ్‌లో అదరగొట్టగా, కెప్టెన్ గిల్ ఫ్లాఫ్ అయ్యాడు. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా-ఎ 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 319 పరుగులు చేసింది. టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి 88 బంతుల్లో 91 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. రవీంద్ర జడేజా 39 బంతుల్లో 45 పరుగులతో అజేయంగా నిలిచాడు. రుతురాజ్ గైక్వాడ్ 38 బంతుల్లో 42 పరుగులు చేయగా.. కేఎల్ రాహుల్ 29 బంతుల్లో 36 పరుగులతో రాణించాడు. కానీ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మాత్రం 8 బంతుల్లో 7 పరుగులే చేసి పెవిలియన్ చేరాడు. అనంతరం 320 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియా-బి 50 ఓవర్లలో 7 వికెట్లకు 309 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ 68 బంతుల్లో 72 పరుగులతో ఆకట్టుకోగా.. రోహిత్ శర్మ 59 బంతుల్లో 64 పరుగులు చేశాడు. వీరిద్దరూ జట్టుకు మంచి ఆరంభాన్ని అందించారు. మిడిలార్డర్‌లో నితీష్ కుమార్ రెడ్డి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 57 బంతుల్లో 61 పరుగులు చేసి జట్టు స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. నమన్ ధీర్ 28 బంతుల్లో 31 పరుగులు చేశాడు. అలా చివరికి ఇండియా-బి 309 పరుగులకే పరిమితమై ఓటమి చవిచూసింది. మొత్తం మీద ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ద్వారా కోహ్లి, రోహిత్ తమ బ్యాటింగ్‌తో అలరించారు. తొలి వన్డే తిరువనంతపురం వేదికగా జరుగనుండగా, రెండో మ్యాచ్ గౌహతి వేదికగా సెప్టెంబర్ 30న ఉంటుంది. అక్టోబర్ 3వ తేదీన న్యూ ఛండీఘర్ వేదికగా చివరి మ్యాచ్ జరగుంది. ఈ వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఇద్దరూ బరిలోకి దిగనున్నారు. అక్టోబర్ 6వ తేదీ నుంచి ఇరుజట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ షురూ కానుంది.

## విండీస్‌తో తొలి వన్డే..

# భారత తుదిజట్టు అంచనా!




తిరువనంతపురం వేదికగా ఆదివారం భారత్, వెస్టిండీస్ మధ్య తొలి వన్డే జరగనుంది. ఈ నేపథ్యంలో భారత తుది జట్టులో ఎవరు ఉంటారు, ఎవరు ఉండరనే దానిపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఆసియా గేమ్స్‌లో పాల్గొనేందుకు శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు జపాన్‌కు రాగా, విండీస్‌తో వన్డే సిరీస్‌కు రోహిత్, కోహ్లి, జడేజా సిద్ధమయ్యారు. వీరితో పాటు కెప్టెన్ గిల్, వైస్‌కెప్టెన్ కేఎల్ రాహుల్ ఆడనున్నారు. ఈ నేపథ్యంలో విండీస్‌తో తొలి వన్డేకు తుదిజట్టు ఎలా ఉండబోతుందనేది ఒకసారి పరిశీలిద్దాం. తుదిజట్టులో యశస్వి జైస్వాల్, నమన్ ధీర్, ధ్రువ్ జురెల్‌లకు అవకాశం దక్కడం కష్టమే. శ్రేయస్ అయ్యర్ స్థానంలో భారత జట్టులోకి వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ మాత్రం ఆడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇక ఓపెనర్లుగా రోహిత్ శర్మ, గిల్ రానున్నారు. వన్‌డౌన్‌లో కోహ్లి, ఆ తర్వాత రుతురాజ్ గైక్వాడ్ వచ్చే అవకాశముంది. ఇక ఐదో స్థానంలో వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ రానున్నాడు. ఆల్‌రౌండర్లుగా జడేజా, నితీశ్‌కుమార్ రెడ్డి ఆడే అవకాశముంది. జట్టులో ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఉండవచ్చు. ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో ప్రసిద్ధ కృష్ణ మహమ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్‌లు ఆడే అవకాశముంది. ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన ఫాస్ట్ బౌలర్ ఆకిబ్ నబీ, నమన్ ధీర్ బెంచ్‌కు పరిమితం కానున్నారు.

భారత తుది జట్టు అంచనా: రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, ప్రసిధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్, గుర్నూర్ బ్రార్.




## ఉద్యోగులపై ఓపెన్ ఏఐ వేటు

ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ హవా కొనసాగుతోంది. కృత్రిమ మేధను మరింత అభివృద్ధి చేయడానికి ఏఐ కంపెనీలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ.. తమ మోడళ్లకు మనుషుల సహజ స్పందనపై శిక్షణనివ్వడానికి కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించింది. అయితే ఏఐకి ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా ఆ ఉద్యోగులు.. ఏఐనే వాడుతుండడంతో అటువంటి వారిపై వేటు వేసింది. తమ ఏఐ చాట్‌బాట్ ఎలా స్పందిస్తుందో అంచనా వేయడానికి, చాట్‌జీపీటీ వినియోగదారుల ప్రాంప్ట్‌లను చదవడానికి ఓపెన్ ఏఐ సంస్థ వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించింది. వాటిని చదివిన తర్వాత ఉద్యోగులు ఏఐ ప్రతిస్పందనలను విశ్లేషించి.. వినియోగదారుడు ఏమి అడిగారో ఆ సమాచారాన్ని మాత్రమే ఇచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఇందుకుగానూ కంపెనీ వారికి గంటకు 50 డాలర్ల (సుమారు రూ.4,795) జీతం అందిస్తోంది. అయితే.. వీరిలో చాలామంది కంపెనీ మోడళ్లకు స్వయంగా శిక్షణ ఇవ్వడానికి బదులుగా.. ఏఐనే వాడి ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన యాజమాన్యం.. సదరు ఉద్యోగులను సంస్థ నుంచి తొలగించింది. ఇలా కృత్రిమ మేధ సాయంతో ఏఐకి శిక్షణనివ్వడం వల్ల 'మోడల్ కొలాప్స్' అయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. సృష్టించిన కంటెంట్‌తోనే శిక్షణ పొందుతున్న కొద్దీ.. ఒకే రకమైన సమాచారం రిపీట్ అవుతుందని, కాలక్రమేణా వివిధ మోడల్స్ వాటి కచ్చితత్వాన్ని, వైవిధ్యతను కోల్పోతాయన్నారు.




## సమ్మె ఎఫెక్ట్.. ఏటీఎం ఛార్జీలు రద్దు చేసిన ప్రభుత్వరంగ బ్యాంకులు

దిల్లీ: బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వరంగ బ్యాంకులు కీలక నిర్ణయం తీసుకున్నాయి. సమ్మె సమయంలో వినియోగదారులకు ఊరట కల్పిస్తూ ఏటీఎం లావాదేవీలపై ఛార్జీలను రద్దు చేశాయి. సెప్టెంబర్ 28-30 మధ్య ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. సాధారణంగా నిర్ణీత సంఖ్య దాటిన తర్వాత ఏటీఎంలో చేసే లావాదేవీలపై బ్యాంకులు రుసుములు వసూలు చేస్తుంటాయి. సమ్మె నేపథ్యంలో ఆ రుసుముల వసూళ్లకు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వరంగ బ్యాంకులు ఉమ్మడిగా నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ వంటి ప్రభుత్వరంగ బ్యాంకులు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. ఐదు రోజుల పనిదినాలు, ఇతర డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వరంగ బ్యాంకు యూనియన్లు మూడు రోజుల పాటు సమ్మెకు దిగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాతాదారులకు బ్యాంకు సేవల్లో ఆటంకం ఏర్పడకూడదన్న ఉద్దేశంతో ఈ ఆదివారం బ్యాంకులు పనిచేసేలా కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలోనే సమ్మె కాలంలో ఏటీఎం ఛార్జీల భారం నుంచి ఖాతాదారులకు ప్రభుత్వరంగ బ్యాంకులు మినహాయింపు ఇచ్చాయి. ఏ బ్యాంకు ఏటీఎం నుంచి లావాదేవీలు జరిపినా ఛార్జీలు వర్తించబోవని స్పష్టంచేశాయి. అలాగే, బ్యాంకు సేవల కోసం మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వాట్సప్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించాయి.